సహకార సంఘ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సహకార సంఘాల ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం నేటికీ పరిష్కారం చేయలేదని వాపోయారు. సహకార సంఘాల రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, ఉద్యోగ వయోపరిమితి పెంచాలని, వేతన సవరణ చేయాలని తదితర డిమాండ్ చేశారు. 8వ తేదీన నల్ల బ్యాడ్జీలతో నిరసన, 9వ తేదీన పార్లర్ రన్‌తో పాటు కంప్యూటర్ పనులు నిలుపుదల, 10వ తేదీన డిసిసిబి కార్యాలయం వద్ద ధర్నా, 20వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా, 27వ తేదీన రాష్ట్ర సహకార బ్యాంకు విజయవాడలో మహాధర్నా, అప్పటికి సమస్యలు పరిష్కారం కాకుంటే ఫిబ్రవరి 10వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు ఉద్యోగులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట పిఏసిఎస్ సీఈవో పి. నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డా సబ్ రిజిస్టర్ కార్యాలయం

ఉన్నతాధికారుల విచారణలో బయటపడిన అక్రమ రిజిస్ట్రేషన్ల దందా

విశాలాంధ్ర - కే.కోటపాడు: స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అవినీతి పొంగిపోర్లుతోంది. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఆస్తుల రిజిస్ట్రేషన్లలో లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు రావడం, వెంట వెంటనే ఉన్నతాధికారులు రంగంలోకి దిగి నష్ట నివారణ చర్యలు చేపట్టడం, ఫలితంగా కొద్దికాలంలో పదవి విరమణ చేపడుతున్న సబ్ రిజిస్టర్ బదిలీ చేయడం జరిగి పోయాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక సబ్ రిజిస్టర్ సత్యనారాయణ మూడు నెలల క్రిందట కే.కోటపాడు కార్యాలయానికి బదిలీ అయ్యారు. వచ్చిన దగ్గర్నుంచి ఇతర కార్యాలయాల పరిధిలో ఉన్న దాక్యుమెంట్లపై దృష్టి పెట్టి అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారని ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో విశాఖకు సమీపంలో ఉన్న తుంగ్లాంకు చెందిన గిఫ్ట్ సెటిల్మెంట్ ఒకటి, నరవకు చెందిన నోషనల్ ఖాతా డాక్యుమెంట్ ఒకటి, చంద్రయ్య పేటకు చెందిన ఆస్తుల రిజిస్ట్రేషన్లపై అవకతవకలు జరిగినట్లు తెలిసింది. ఇందులో బాధితులు కొందరు కోర్టుకు వెళ్లి నోటీసులు పంపడంతో అక్రమ రిజిస్ట్రేషన్ల బాగోతం వెలుగు చూసింది. జిల్లా రిజిస్టార్ మాధవరావు కె.కోటపాడు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ చేపట్టి డాక్యుమెంట్లను పరిశీలించారు. డాక్యుమెంట్లలో అక్రమాలు జరిగింది వాస్తవమేనని గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. మరో మూడు నెలల్లో పదవి విరమణ చేస్తున్న సబ్ రిజిస్టర్ సత్యనారాయణను విశాఖలో చిట్స్ సహాయ రిజిస్టర్‌గా బదిలీ చేశారు. అదే స్థానంలో ఉన్న ఆర్.శకుంతలను కే.కోటపాడుకు బదిలీపై పంపారు. ఈ విషయాలపై జిల్లా రిజిస్టర్ మాధవరావును వివరణ కోరగా నిబంధనలకు విరుద్ధంగా చేయకూడని డాక్యుమెంట్లు చేశారని వాటిపై ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. తదుపరి ఆదేశాల మేరకు సబ్ రిజిస్టర్‌పై చర్యలు ఉంటాయి అన్నారు.

సీపీఐ నాయకులు ముందస్తు అరెస్టులు

ఆగ్రహించిన జిల్లా సహాయ కార్యదర్శి రాజాన

విశాలాంధ్ర - అనకాపల్లి: మోడీ పర్యటన అడ్డుకుంటామని ముందుస్తు అరెస్టు చేయడం సిగ్గు చేటు అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కశింకోటలో గల నివాసంలో దొరబాబును పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌కి సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయమని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నక్కపల్లిలో చేయబోతున్న బల్క్ డ్రగ్స్ ఏర్పాటుకు భూ నిర్వాసితులకు ప్యాకేజీ పూర్తి చేసిన తర్వాతే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సిపిఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వై.ఎస్.భద్రంను విశాఖలో జరిగే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభకు వెళ్లకుండా పోలీసులు కాపలా కాశారు.

సీపీఐ నేత రాధాకృష్ణ హౌస్ అరెస్ట్

విశాలాంధ్ర - గొలుగొండ: భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆంధ్ర రాష్ట్రానికి ఎన్నిసార్లు వచ్చినా కోట్లాది రూపాయలు ప్రజలకు పన్నుల భారమే తప్ప ప్రయోజనం ఏమి లేదని సీపీఐ జిల్లా సమితి సభ్యులు, ఏఐవైఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు జి.రాధాకృష్ణ ఆరోపించారు. బుధవారం విశాఖపట్నం భారత ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ వస్తున్న నేపథ్యంలో రాధాకృష్ణను హౌస్ అరెస్టు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, విభజన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. హౌస్ అరెస్టలతో పోరాటాలను ఆపలేరని అన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: మండలంలోని తురకలపూడి, పి.పి. అగ్రహారం పంచాయతీ గొల్లపాలెం గ్రామం పరిసర ప్రాంతాలలో నాటుసారా తయారు చేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి.సుదీర్ ఆదేశాల మేరకు స్టేషన్ హౌస్ ఆఫీసర్, చోడవరం ఎక్సైజ్ సీఐ పాపు నాయుడు తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. 400 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. అదే క్రమంలో పి.పి.అగ్రహారం గ్రామపంచాయతీ గొర్లపాలెం గ్రామ శివారులో 600 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసినట్టు నాటుసారా వంటకు వినియోగించిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

చందన అలంకరణలో వెంకన్న

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరంలో వైభవ వెంకటేశ్వర స్వామి చందన అలంకరణలో దర్శనమిచ్చారు. ధనుర్మాసం ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారిని చందనముతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు చక్రవర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అలం కరణకు పూజలనంతరం సామూహిక హారతులతో వేదమంత్రాలను వినిపించారు.

రెండో రోజు కొనసాగిన హౌస్ అరెస్ట్

విశాలాంధ్ర - యస్.రాయవరం: సిపిఎం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు రెండో రోజు హౌస్ అరెస్టు కొనసాగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా పలువురు నాయకులను అరెస్టు చేయడం జరిగింది. బల్క్ డ్రగ్‌కు వ్యతిరేకంగా అప్పలరాజు పోరాటం చేస్తున్న నేపథ్యంలో ధర్మవరం గ్రామంలోని ఆయనను హౌస్ అరెస్ట్ చేసిన విషయం తెలుసుకున్న పలువురు యువకులు సంఘీభావం తెలియజేశారు. ఇటువంటి అరెస్టులకు భయపడమని ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ తనిఖీ

విశాలాంధ్ర -సబ్బవరం: మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డిఎంహెచ్ఓ) డాక్టర్ పదాల రవికుమార్ బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఎస్‌కు సంబంధించిన రికార్డ్‌లను పరిశీలించినట్లు స్థానిక వైద్యాధికారి ఎస్ఎస్ఆర్ చక్రవర్తి తెలిపారు. క్యాన్సర్ సర్వే (ఎన్ సి డి,) ఆర్‌బిఎస్‌కే సర్వేలను పరిశీలించారు. వ్యాక్సిన్ నిలవచేసే ఐఎల్ఆర్ డీప్రెజర్, టెంపరేచర్ చార్ట్‌ను పరిశీలించారు. పిహెచ్‌సిలో 63 రకాల టెస్టులు జరగాలని సూచించారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మకరజ్యోతి ఉత్సవాలు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - నర్సీపట్నం: ఈ నెల 13 నుంచి 15 వరకు నిర్వహించే అయ్యప్ప మకరజ్యోతి ఉత్సవాలను బుధవారం రాజేష్, సతీమణి దివ్యశ్రీలు రాట వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చింతల రాజేష్ మాట్లాడుతూ 13 నుంచి 15 వరకు స్వామి వారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరుగుతాయని, 14వ తేదీన విష్ణు సహస్రనామ పారాయణం, సాయంత్రం రథయాత్ర, క్లాసికల్ నృత్యాలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రతిభావంతుల సన్మానం, రాత్రి 7 నుంచి జబర్దస్త్ టీమ్, పల్సర్ బైక్ ఝూన్సీ ప్రదర్శనలు నిర్వహిస్తారని వివరించారు. కనుమ రోజు మనిపూర్ ఫోక్ డాన్స్ కూడా ఉంటుందని తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాలలో పాల్గొని స్వామి ఆశీర్వాదాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్బంధం, అరెస్టులు దుర్మార్గం

విశాలాంధ్ర - పరవాడ: మోడీ పర్యటన సందర్భంగా జిల్లాలో కార్మిక, రైతు, ప్రజా సంఘాల నాయకులను గృహ నిర్బంధాలు చేసి అరెస్టులు చేయడం దుర్మార్గమైన చర్యని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. పరవాడ ఫార్మాసిటీలో బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా మోడీ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పరిశ్రమలను పెట్టవద్దని, దేవరపల్లి హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పెట్టి గిరిజన జీవితాలను అతలాకుతలం చేయొద్దని అన్నారు. అచ్యుతాపురం గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్ట్ ఎన్టీపీసీలో స్థానికులకు 75శాతం ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్బంధాలు, అరెస్టులతో ఉద్యమాలను ఏమాత్రం ఆపలేరని గనిశెట్టి హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె. పోతునాయుడు, పి.చిన్నారావు, సత్తిబాబు, వై.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్కు శంకుస్థాపన వద్దే వద్దు

మత్స్యకారులు నిరసన, వ్యతిరేకత పోలీసుల అదుపులో వైసీపీ, సీపీఎం నేతలు

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేట ప్రాంతంలో ప్రభుత్వం బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు బుధవారం ప్రధాన మంత్రి నరేంద్రమోడి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ విశాఖపట్నం నుండి వర్చ్యువల్‌గా శంకుస్థాపన చేయడాన్ని నిరసిస్తూ, రాజయ్యపేట, తమ్మయ్యపేట, పాటిమీద గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున, నిరసన, ఆందోళన చేపట్టారు. ఈ మేరకు ముందస్తు చర్యలలో భాగంఖ వైసీపీ సీనియర్ నాయకులు వీసం నాయకులు, వైకాపాాయకులు సూరకాసుల గోవిందు, చందనాడ సర్పంచ్ తళ్ళ భార్గవ్, ఎంపిటిసి తిరుపతిరావులను అరెస్టు చేసి నక్కపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ ఆందోళనకు నాయకత్వం వహించిన సిపిఎం నేత జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.సత్యనారాయణ, మండల కార్యదర్శి ఎం.రాజేష్‌లను అరెస్టు చేసి పోలీసు వాహనాలపై తీసుకువెళ్ళనడానికి పోలీసులు ప్రయత్నం చేయగా ప్రజలు వాహనాలను చుట్టుముట్టి ముందుకు కదలకుండా అడ్డగించారు. పోలీసులు ఎంత ప్రయత్నించినా ప్రజలు కదలలేదు, ఈ సందర్భంగా పోలీసులకు, గ్రామస్తులకు పెద్ద ఎత్తున తోపులాట జరిగింది. అనంతరం అదనంగా పెద్ద ఎత్తున పోలీసులను రప్పించి తీవ్రమైన ప్రతిఘటన అనంతరం సిపిఎం నాయకులు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. రాజయ్యపేట గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు ఎం.మహేష్‌బాబు, ఎం.బైరాగిరాజు, ఎం.జాన్‌లను పోలీసు మంగళవారం నుండి గృహ నిర్బందం చేసారు. నక్కపల్లి జెడ్‌పిటిసి గోసల కాసులమ్మను హౌస్ అరెస్టు చేసారు. బల్క్ డ్రగ్ పార్కు వద్దంటూ తీరంలో మత్స్యకారులు జలదీక్ష చేపట్టారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన హెట్రో డ్రగ్స్ కంపెనీ వలన మత్స్య సంపద నశించిపోయి, వేట లేక వలసలు పోతున్నామని, క్యాన్సర్, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు, చర్మ వ్యాధులు బారిన పడుతున్నామని, ఇప్పుడు మరలా బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేసి పర్యావరణాన్ని మా ఆరోగ్యాలు ప్రాణాలు దెబ్బ తీస్తారా అని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్యాకేజి ఇవ్వాలని, సాగు భూములకు నష్టపరిహారం చెల్లించాలని, డి.ఫారం భూములలో గల చెట్లుకు నష్టపరిహారం చెల్లించాలని, ఫిషింగ్ జెట్టి నిర్మించాలని డిమాండ్ చేసారు.

కంచాలు పట్టుకొని మహిళలు నిరసన : చందనాడ పంచాయితీ తమ్మయ్యపేట గ్రామానికి చెందిన కొంత మంది మహిళాలు కంచాలు పట్టుకొని శబ్దాలు చేస్తు బల్క్ డ్రగ్ పార్కు శంకుస్థాపన ఆపాలని కోరుతూ నిరసన వ్యక్తం చేసారు.

ప్రకృతి వ్యవసాయంతో ఎంతో మేలు

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండల వ్యవసాయ అధికారి ఎం.వాసుదేవరావు ఆధ్వర్యంలో బుధవారం ఉదయం మాడుగుల బస్టాండ్‌లో దేవి స్టేజి వద్ద ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆకుకూరలు, కూరగాయలు మొదలుకొని ఎటువంటి రసాయనాలు లేకుండా ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలను మాడుగుల ప్రజలు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మండల ఇన్‌చార్జ్ గండి శ్రీనివాసరావు, సిబ్బంది దేవి, కొండాజీ పాల్గొన్నారు.

గృహనిర్బందంపై మండిపడ్డ సీపీఎం నాయకులు

విశాలాంధ్ర - రాంబిల్లి: విశాఖపట్నంలో కూటమి ప్రభుత్వం నాయకులైన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వస్తున్న నేపథ్యంలో ముందస్తుగా సిపిఎం నాయకులను పోలీసులు గృహనిర్బంధించడం పట్ల రాంబిల్లి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జి.దేవుడు నాయుడు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌కు అధికారం చేపట్టిన బిజెపి నాయకులు పదేళ్లు పూర్తయిన సొంతగనులు ఎందుకు కేటాయించలేదని, స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసేందుకు ఎందుకు కుట్ర పన్నుతున్నారని ప్రశ్నించారు. కాకినాడలో తిరస్కరించిన బల్క్ డ్రగ్స్ కంపెనీలను అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఎందుకు నెలకొల్పుతామని చెప్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. అలాగే పూడిమడక ఎన్టిపిసిలో గ్రీన్ హైడ్రోజన్ పవర్ ప్లాంట్‌లో స్థానికులకు ఎన్ని ఉద్యోగాలు ఇస్తారో సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువైద్యాధికారిగా మణిదీప్

విశాలాంధ్ర - మాకవరపాలెం: మాకవరపాలెం పశు వైద్యాధికారిగా మణిదీప్ నియమితుల య్యారు. గత నాలుగు నెలలుగా ఇక్కడ పశువైద్యాధికారి పోస్ట్ ఖాళీగా ఉంది. దీంతో కోటవురట్ల మండలం జల్లూరు వైద్యాధికారి ప్రతాప్ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నూతన వైద్యాధికారిగా మణిదీప్‌ను నియమించారు. ఆయన బుధవారం విధుల్లో చేరారు. మణిదీప్‌ను వెటర్నరీ అసిస్టెంటు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధి కూటమి లక్ష్యం

విశాలాంధ్ర- కోటవురట్ల: ప్రజా సంక్షేమంతోపాటు గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మండల టీడీపీ అధ్యక్షులు జానకి శ్రీనివాసరావు అన్నారు. కే.వెంకటాపురంలో బుధవారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నాయకత్వంలో మండలంలో కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కైలాసపట్నం గ్రామంలో పది లక్షల రూపాయలతో సిసి రోడ్ నిర్మాణ పనులను గ్రామ టీడీపీ అధ్యక్షులు భీముని మాణిక్యాలరావు, జనసేన నాయకులు కోలా రమేష్ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. వెంకటాపురం, చౌడువాడ పాములవాక, కోటవురట్ల గ్రామాల్లో సిసి రోడ్ నిర్మాణ పనులు చేపట్టమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయ కులు వేచలపు జనార్ధన్, లింగం నాయుడు, తిరుమలరావు, దాలినాయుడు, బోడపాలెం సత్తిబాబు, సూర్యప్రకాష్, పేరుల శ్రీను, బత్తుల రామకృష్ణ జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆ నాయకుడుంటే పూడిమడక పేరు మార్చేసేనేమో...!

విశాలాంధ్ర - అచ్యుతాపురం: గతంలో ఆ నాయకుడు దత్తత అని చెప్పి పూడిమడకను కాకుండా తన గ్రామం పేరు ఎన్టీపీసీకు పేరు పెట్టాలని గట్టి ప్రయత్నాలు చేశారు. గతంలో పూడిమడక వద్ద ఏర్పాటు చేయాలనుకున్న ఎన్టీపీసీకి పూడిమడక ఎన్టీపీసీ అని పేరు పెట్టారు. మొదట్లోనే ఆ ప్రాజెక్టుకు పూడిమడక ఎన్టీపీసీ అని పేరు పెట్టారు. కానీ ఆ నాయకుడు ఎలాగైనా ఎన్టీ పీసీకి తన గ్రామం పేరు పెట్టాలని పట్టు బట్టారు. ఇంతలో కొన్ని అనివార్య కారణాల వలన ఆ ప్రాజెక్ట్ ఆగిపోయింది. తమ అమా యకత్వాన్ని ఆసరాగా తీసుకుని ఆ గ్రామానికి ఎసరు పెట్టాలని అనుకున్నాడని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ రంగ సంస్థ రూపంలో పూడిమడక ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ బుధవారం భారత ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతంలో ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టును ప్రజలందరూ స్వాగతిస్తున్నారు. ఈ పరిశ్రమలోనైనా స్థానికులకు చిన్నచిన్న ఉద్యోగాలకు పరిమితం చేయకుండా అర్హతను బట్టి స్థానికులకు శాశ్వత ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర-పరవాడ: పరవాడ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల్లో భాగంగా దాని పరిధిలోని వలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ కసింకోట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పరవాడ, వెన్నెలపాలెం, బొద్దపువానిపాలెం, రావాడ, భరణికం, స్వయంభువరం, పీఎస్ భోనంగి, గొర్లివానిపాలెం, గొల్లలపాలెం, కలపాక, పి.బోనంగి, ఈ. భోనంగి, దేశపాత్రునిపాలెం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

రూ. 10లక్షలు అవినీతికి పాల్పడ్డ సిహెచ్ నాగపురం సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలి

నాగపురం మాజీ సర్పంచ్ కోలగాన ఎద్దేవా!

విశాలాంధ్ర-గొలుగొండ: పంచాయితీ అభివృద్ధి పనుల్లో పాటు, రామాలయం నిర్మాణం పేరుతో పది లక్షల రూపాయలు అవినీతికి పాల్పడ్డ సిహెచ్ నాగపురం సర్పంచ్ ఎలమంచిలి రఘురామ చంద్రరావు పై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ మాజీ సర్పంచ్ కొలగాన రామారావు టిడిపి నాయకులు బొప్పన ప్రసాదు డిమాండ్ చేశారు. బుధవారం సిహెచ్ నాగపురంలో విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొలగాన రామారావు, బొప్పన ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ గ్రామంలో పంచాయతీ నిధులు 3 లక్షలు, దేవాలయం నిర్మాణం పేరుతో ఏడు లక్షలు రూపాయలు అవినీతికి పాల్పడ్డారని వీరు ఆరోపించారు. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసామన్నారు. అయితే గ్రామ సర్పంచ్ అవినీతికి పాల్పడి 2013, 2018 పదవి కాలంలో టిడిపి సర్పంచ్ కొలగాన రామారావు, టిడిపి నాయకులు మరుగుదొడ్లులో అవినీతి చేశారని ఆరోపిస్తూ అధికారులకు ఫిర్యాదు చెయ్యడం హాస్యాస్పదమని ఎద్దేవ చేశారు. వైసిపి పార్టీ నుండి గెలుపొందిన సర్పంచ్ బాధ్యతలు తీసుకునే ముందు అవినీతి కనిపించలేదా అని ప్రశ్నించారు. తీరా గ్రామ సర్పంచ్ అవినీతిలో కూరుకు పోవడంతో ఏం చేయాలో దిక్కుతోచక టిడిపి నాయకులు పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఆలయ నిర్మాణంలో ఏడు లక్షల రూపాయలు ఏమయ్యా అని సమాధానం చెప్పాలంటూ గ్రామస్తులు అడిగినప్పటికీ సమాధానం చెప్పకపోవడం సిగ్గుచేటని అన్నారు. వైసీపీ సర్పంచ్ రఘు రామచంద్ర రావు అంగన్వాడి టీచర్ పోస్టుకు ఐదు లక్షలు, జగనన్న ఇళ్ల స్థలాల పేరుతో ఒక్కో లబ్ధిదారు నుండి?2, వేల రూపాయలు చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. అలాగే జలసిరి బోరు లో ప్రభుత్వాన్ని మోసం చేసి జలసిరి బోరు లబ్ధి పొందారని అన్నారు. ఇలాంటి వ్యక్తి దెయ్యాలు వేదాలు వల్లినట్లు మాపై బురద చల్లడం సమంజసం కాదన్నారు. వీటన్నిటిపై ప్రభుత్వం అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పోలిశెట్టి జగ్గయ్య దొర సేనాపతి వరహాలబాబు దుంపలపుడి వెంకటేశ్వరరావు అప్పన సత్తిబాబు కంకిపాటి రామారావు పోలిశెట్టి సత్యనారాయణ, ఎనుముల రాజబాబు పాల్గొన్నారు.

సిపిఎం నేత ఉప్పాడ సత్యవతి గృహ నిర్బంధం

విశాలాంధ్ర-సబ్బవరం: సిపిఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి పోలీసులు గృహ నిర్బంధం చేశారు.ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం వర్చువల్లో శంకుస్థాపన చేయనున్న గ్రీన్ హైడ్రోజన్ హబ్, బల్క్ డ్రగ్ పార్కు ప్రాంతాల్లో పోలీసులు భారీగా మోహరించారు. ప్రజల బతుకులను దెబ్బతీసే బల్క్ డ్రగ్ పార్కు శంకుస్థాపనను వ్యతిరేకిస్తూ నల్లరిబ్బన్లు కట్టుకొని నిరసన తెలపాలని సిపిఎం ఇచ్చిన పిలుపుకు ప్రజల నుంచి స్పందన వస్తుండడంతో ప్రభుత్వం నిరంకుశ చర్యలకు పాల్పడుతోంది. ఆందోళనకారుల కదలికలపై నిఘా పెట్టింది. ఈ క్రమంలోనే సబ్బవరం మండలంలో సిపిఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి ని బుధవారం ఉదయం నుంచి గృహ నిర్బంధం సబ్బవరం పోలీసులు చేశారు. ప్రభుత్వ, పోలీసు తీరును సిపిఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి ఖండించారు.

ఆలయానికి మైక్ సెట్లు విరాళం

విశాలాంధ్ర-వి.మాడుగుల: మాడుగుల మండలం ఎం.కోడూరు గ్రామంలో తెల్లవారుజామున సాయంత్రం మోదకొండమ్మ ఆలయం దగ్గర గ్రామంలోనూ సంతకం పట్టు వద్ద మోదకొండమ్మ భక్తి గీతాలు ప్రవచనాలు ప్రజలందరూ ఆలకించదానికి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ జల్లి హరిప్రసాద్, మెంటా వెంకటరమణ, శీరాపెంటావు, ఖాతా చిరంజీవి వీరంతా కలిసి 30వేలు విలువగల మైక్ సెట్ హారన్సను మోదకొండమ్మ ఆలయ చైర్మన్ గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు బుధవారం ఉదయం అందించారు. ఈ మైక్ సెట్ హారన్స ద్వారా గ్రామంలో అమ్మవారి భక్తి గీతాలు ప్రవచనాలు ప్రజలందరూ ఆలకించే విధంగా తెల్లవారుజామున సాయంత్రం ఏర్పాటు చేస్తున్నామని సంజీవరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాపర్తి సూర్యనారాయణ, పడాల అప్పలనాయుడు, జన్నపిల్లి నాగరాజు, గెంజి రాజేష్ కుమార్, గొల్లవిల్లి కృష్ణ, కోన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్ కుమార్ చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని సబ్బవరం పాల ఉత్పత్తిదారుల సంస్థ లో బుధవారం పాల సొసైటీ ప్రెసిడెంట్ సబ్బవరపు సత్యనారాయణ (బుజ్జి)ఆధ్వర్యంలో సంక్రాంతి డబల్ బోనస్ పంపిణీ చేశారు. 192 మంది పాల ఉత్పత్తిదారు లకు రూ 9,12,418లు అందజేశారు .ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు పాడి రైతులు ఆనంద ఉత్సవాలతో విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. సబ్బవరం యూనిట్ ఆఫీసర్ ఏ .ఆర్.ప్రభాకర్, సబ్బవరం పాల ఉత్పత్తి దారుల సంస్థ ప్రెసిడెంట్ సబ్బవరపు సత్యనారాయణ (బుజ్జి) ముఖ్య అతిథులుగా పాల్గొని డైరీ చైర్మన్ ఆనంద్ కుమార్ చిత్రవ టానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పాల ఉత్పత్తిదారులకు వారి చేతుల మీదుగా సంక్రాంతి బోనస్ పంపిణీ చేశారు. అలాగే అత్యధిక బోనస్ వచ్చిన ముగ్గురు పాడి రైతులకు సొసైటీ ప్రెసిడెంట్ సబ్బవరపు సత్యనారాయణ సొంత నిధులతో బహుమతులు అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులు సంక్షేమమే ధ్యేయంగా విశాఖ డెయిరీ పనిచేస్తుందన్నారు. రానున్నకాలంలో విశాఖ డెయిరీ అభివృద్ధికి పాల ఉత్పత్తిదారులందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఆడారి శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు సవవరపు అప్పలనాయుడు గండి శ్రీరాములమ్మ ,సబ్బవరపు గంగతల్లి, వేతన కార్యదర్శి ఎస్ సత్యనారాయణ, పాడి రైతులు పాల్గొన్నారు.

కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఉత్తమ కృషి విజ్ఞాన కేంద్రంగా ఎంపిక

విశాలాంధ్ర -బుచ్చియ్యపేట: మండలంలోని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఈ ఏడాదికి ఉత్తమ కృషి విజ్ఞాన కేంద్రంగా ఎంపికైంది. బుధవారం గుంటూరు ఎన్జీరంగా వ్యవసాయ యూనివర్సిటీలో ఉపకులపతి శారద జయలక్ష్మిదేవిచే కొండెంపూడి ప్రధాన శాస్త్రవేత్త ఎన్.రాజకుమార్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత రైతుల తోడ్పడుతో పాటు శాస్త్రవేత్తలు సత్తిబాబు, సౌజన్య, బాబు, రామనాయుడు, కిషోర్, రాజేష్, స్రవంతి కృషితో ఉమ్మడి విశాఖ జిల్లాలో రైతులకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కొండెంపూడి కేంద్రంగా శాస్త్రవేత్తలు రైతులకు సాంకేతిక సలహాలు, నారు మొక్కలు, పురుగుమందులు, విత్తనాలు క్షేత్ర సందర్శన క్షేత్ర ప్రదర్శన నూతన వంగడాల తయారీ ప్రయోగాలు వంటి వ్యవసాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.గత ఆరేళ్లుగా ఇక్కడ శాస్త్రవేత్తల కృషిని గుర్తించి ఎంజీరంగా యూనివర్సిటీ వారు కొండంపుడిని ఉత్తమ కృషి విజ్ఞాన కేంద్రముగా ఎంపిక చేశారు ఈ సందర్భంగా శాస్త్రవేత్తలను పలువురు అభినందించారు.

ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభకు భారీగా తరలి వెళ్లిన కూటమి శ్రేణులు

విశాలాంధ్ర-సబ్బవరం: విశాఖపట్నంలో జరుగుతున్న భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు మండలంలోని కూటమి శ్రేణులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సబ్బవరం మండల కేంద్రంలో పి బి వి ఎస్ ఎన్ రాజు, పల్లా తాతారావు, బర్ల రమణ,కోరాడ శ్రీనివాసరావు, ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు బహిరంగ సభకు తరలివెళ్లారు. అలాగే మొగలిపురంలో ఎంపీటీసీ తమరాన బంగారునాయుడు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో జనాలు బహిరంగ సభకు తరలి వెళ్లారు. శ్రీ గణేష్ దుర్గానగర్ లో జనసేన వీర మహిళ బంతికొల్ల పద్మ, గొర్లి కుమార్ ఆధ్వర్యంలో ,వంగలి నుండి సర్పంచ్ ఆకుల శ్రీ హేమ గణేష్ ఆధ్వర్యంలో, రాయపుర అగ్రహారం లో పిల్లల అప్పలనాయుడు ఆధ్వర్యంలో, ఆరిపాకలో ఆడారి నాగరాజు, మల్ల వెంకటరమణ ఆధ్వర్యంలో, బంగారమ్మపాలెంలో దొడ్డి సూర్య ప్రకాష్ దాడి కన్నంనాయుడు ఆధ్వర్యంలో, పైడివాడ అగ్రహారం లో అక్కిరెడ్డి దుర్గి నాయుడు, బొబ్బరి కన్నారావు ఆధ్వర్యంలో, పైడివాడలో దాసరి వెంకటరమణ,సీరం అప్పలరాజు ఆధ్వర్యంలో, వెదుల్లనరవలో మొల్లి ముత్యాలు ఆధ్వర్యంలో, నంగినారపాడు లో జనసేన నేత ఇందల వెంకటరమణ ఆధ్వర్యంలో, గాలి భీమవరంలో కూటమి నేతలు బలిరెడ్డి అప్పారావు, వాకాడ కనకరాజు ఆధ్వర్యంలో ఆసకపల్లిలో కూటమి నేతలు కరణం రామనాయుడు,కర్రి నరసింగరావు ఆధ్వర్యంలో, బాటజంగాలపాలెం లో పడాల వెంకటరమణ ఆధ్వర్యంలో, నారపాడులో సర్పంచ్ మామిడి శంకర్రావు ఆధ్వర్యంలో అంతకాపల్లిలో కూటమి నేతలు రొంగలి దేముడు బాబు, మిడతాడ మహాలక్ష్మి నాయుడు ఆధ్వర్యంలో,ఆదిరెడ్డి పాలెంలో కొటాన అప్పారావు ఆధ్వర్యంలో, పెదనాయుడుపాలెంలో పోతల కనకరాజు, సబ్బవరపు సత్యనారాయణ ఆధ్వర్యంలో, తవ్వవానిపాలెం జనసేన నేత బోకం స్వామినాయుడు ఆధ్వర్యంలో, పలు గ్రామాల నుండి అధిక సంఖ్యలో కూటమి నేతలు, జనం బస్సులలో ప్రధాని బహిరంగ సభకు తరలి వెళ్లారు.